అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

▪ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ▪ అభివృద్ధి పనుల ప్రారంభం

గణపురం, ఆగస్టు 27 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని బుద్దారంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.5 లక్షలతో నిర్మించిన రజక కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.14 లక్షలతో యాదవ, రూ.25 లక్షలతో ఎస్సీ, రూ.25 లక్షలతో ముదిరాజ్ కమ్యూనిటీ భవనాల నిర్మానానికి శంకుస్థాపన చేశారు, రూ.9.70 కోట్లతో బుద్దారం నుంచి రామన్నగూడెం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూ.2.97 కోట్లతో రోడ్డు కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీఎస్ఆర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కే కుమార్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు విడిదినేని అశోక్, చోటేమియా, గండ్ర ఆగంరావు, కటుకూరి శ్రీనివాస్, అంబడిపెల్లి సంపత్‌రావు, మాల భద్రయ్య, మునుకుంట్ల సంగయ్య, సుంకరి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మహదేవపూర్, ఆగస్టు 27 : మండలంలోని బెగ్లూర్‌లో ఇటీవల మృతి చెందిన ఆకుల పోషన్న, చిన్నోల సమ్మయ్య కుటుంబ సభ్యులను మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, పార్టీ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్, సీనియర్ నాయకుడు సుంకె మధు తదితరులు పాల్గొన్నారు.

కొను 'గోల్‌మాల్'పై విచారణ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

మల్హర్, ఆగస్టు 27 : ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై ఈ నెల 25న 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన 'కొను 'గోల్‌మాల్' కథనంపై జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ పీ రాములు విచారణ చేపట్టారు. రైతు సూర్యనారాయణకు రావాల్సిన డబ్బులపై విచారణ చేపట్టగా నిర్వాహకుడు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ విషయంపై ఎంక్వైరీ చేసి రిపోర్టు ఇవ్వాలని కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్‌ను ఒక లేఖ ద్వారా ఆయన కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రాజేశం (ఫైల్)

టేకుమట్ల, ఆగస్టు 27 : మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన కొండ రాజేశం (49) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజేశం భూపాలపల్లి, కాటారం మండలాల్లో వడ్లు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు అమ్మేవాడు. ఈ క్రమంలో ధాన్యం తడవడంతో తాను కొనుగోలు చేసిన ధర కంటే తక్కువకు అమ్మడంతో నష్టపోయాడు. దీంతో సుమారు రూ.3 లక్షల వరకు అప్పు అయింది. మద్యానికి బానిసై ఈ నెల 14న రాత్రి వ్యవసాయ భూమి వద్ద గడ్డి మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల ఆసుపత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అక్కడ బిల్ ఎక్కువ కావడంతో వైద్యులు గ్యారెంటీ ఇవ్వకపోవడంతో మళ్లీ ఈ నెల 18న ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య కొండ లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, DEVULAPALLY SHASHIREKHA (Old Name), W/o DEVULAPALLY KOTESHWAR, R/o. H.No.3-1-243/9/309, Kubera Homes, Kakatiya Colony, Hanumakonda City & Dist., Telangana State-506001., Hereby declare that I have changed my name as DEVULAPALLY BHAVANI (New Name) W/o DEVULAPALLY KOTESHWAR."

WANTED
jobs Apply Now!
★ ప్రముఖ ఫైనాన్స్ సంస్థ యందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేయుటకు అనుభవం కలిగిన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను మరియు హన్మకొండ బ్రాంచిలో పనిచేయుటకు అనుభవం కలిగిన Lady Tele Caller కావలెను.
Cell: 8121225656, 8885558638.
NTW-320314

PLOTS FOR SALE
★HNK, KITS College అంబాల రోడ్‌కు & ముచ్చర్ల రోడ్‌కు కొత్తగా వస్తున్న హైవే రోడ్‌కు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. వెంటనే సంప్ర: 9553255936.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

టేకు కలప స్వాధీనం

ఏటూరునాగారం, ఆగస్టు 27 : మండలంలోని రామన్నగూడెం గోదావరి తీరంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలప దుంగలను అటవీశాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 24 దుంగలను అక్రమంగా చేసినట్లుగా సమాచారం అందడంతో తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.1.68 లక్షలు ఉంటుందన్నారు. అక్రమ నిల్వపై కేసు నమోదు చేసి దుంగలను మండల కేంద్రంలోని టింబర్ డిపోకు తరలించినట్లు అధికారులు చెప్పారు.

'కస్తూర్బా' నియామకాలపై విచారణ చేయాలి

ఏటూరునాగారం, ఆగస్టు 27 : జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో వర్కర్స్, స్కావెంజర్స్, అటెండర్ లాంటి పోస్టులను భర్తీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జాగటి రవి తేజ డిమాండ్ చేశారు. మంగళవారం ఏరాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అధికారుల అండదండలతో వారి బంధువులు, శ్రేయోభిలాషులకు అవకాశాలు కల్పించారని ఆరోపించారు. అలాగే పాఠశాలల్లో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు బైరేశ్, స్వామి, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్య.. విద్యార్థులకు వరం

▪ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
▪ ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27 : సార్వత్రిక విద్య డ్రాపౌట్ విద్యార్థులకు వరమని, సెలవు రోజుల్లో చదువుకోవచ్చని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్, బ్రోచర్‌ను డీఈవో రాజేందర్, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావుతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలు, వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఆదివారం, సెలవు రోజుల్లో తరగతులకు హాజరై ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సు పూర్తి చేయవచ్చన్నారు. డీఈవో మాట్లాడుతూ ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు అధ్యయన కేంద్రాల కో-ఆర్డినేటర్లను సంప్రదించాలన్నారు. ప్రవేశాలకు సెప్టెంబర్ 10 వరకు అవకాశం ఉందన్నారు. ఏసీజీఈ మండల రవీందర్ రెడ్డి, డీసీఈబీ అసిస్టెంట్ కార్యదర్శి శనిగరం భద్రయ్య, మండల నోడల్ అధికారి అశోక్, పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణమోహన్, ఎంఈవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

30న సదరం క్యాంపు

జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో 30న సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం క్యాంపు కోసం మీ సేవ కేంద్రాల్లో కొత్తగా, రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే డాక్టర్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి ఎన్నికలు

కాటారం/ భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27 : ఆర్యవైశ్య మహాసభ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష పదవికి సెప్టెంబర్ 4న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అయితు రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 2 నామినేషన్ల సమర్పణ, అదే రోజు పరిశీలన, 3న నామినేషన్ల ఉపసంహరణ, 4న పోలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. అదేరోజు ఫలితాలు వెల్లడించనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసారి అధ్యక్ష పదవికి కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్యవైశ్య మహాసభ సభ్యులు మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

రేపు జాబ్ మేళా

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27 : భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 29న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ హెటిరో ల్యాబ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జూనియర్ టెక్నీషియన్ 50 పోస్టులు, జూనియర్ కెమిస్ట్రీ 50, జూనియర్ ఆఫీసర్ 50 ఉద్యోగాల ఎంపిక ఉంటుందన్నారు. ఐటీఐ (ఫిట్టర్), బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ ఉత్తీర్ణులై 27 ఏండ్ల యువతీ యువకులు అర్హులన్నారు. వివరాలకు 9701078288, 7702457968 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లకు 31 వరకు గడువు

కాటారం, ఆగస్టు 27 : మండలంలోని దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 31 వరకు గడువు ఉన్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మానస తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 31 సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్లకు గడువు ఉన్నట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత

ములుగు రూరల్, ఆగస్టు 27 : మంత్రి సీతక్కను ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జంగాలపల్లి క్రాస్‌రోడ్ గ్రామస్తులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంచర్ల, జంగాలపల్లి, బంజరుపల్లి క్రాస్‌రోడ్డుల గ్రామస్తులు మాట్లాడుతూ మూడు ముక్కలుగా ఉన్న తమ ప్రాంతాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా కాని, తమకు అందుబాటులో ఉన్న బంజరుపల్లి జీపీలోనైనా కలపాలని కోరారు. శ్మశాన వాటిక లేదని, ఎవరైనా చనిపోతే గుట్ట పక్కన ఖననం చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. చేరాలు, భాస్కర్, కృపాకర్‌రావు, రమేశ్, రవి, లక్ష్మయ్య, రమేశ్, హరి, రాజు, ప్రణయ్, రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు ఎప్పుడు ?

టేకుమట్ల, ఆగస్టు 27 : తాము అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ఎనిమిది నెలలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులకు నెలకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పింఛన్ సైతం సరైన టైంకు ఇవ్వడం లేదన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెండ్ రేణుకుంట్ల మహేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి శిలపాక హరీశ్, రాకేశ్, లడ్డు ఉన్నారు.

జెన్‌కో సీఈకి వినతిపత్రం అందజేత

గణపురం, ఆగస్టు 27: సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు మంగళవారం జెన్‌కో సీఈ సిద్ధయ్యకు వినతిపత్రం ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఇంజినీర్ల ప్రమోషన్లు, రిటైర్డ్ ఇంజినీర్లకు 2010, 12 బ్యాచ్ చెందిన సివిల్ ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్ కాలం చెల్లిన కారణంగా ఆ స్థలంలో కొత్త పవర్ ప్లాంట్ నిర్మించాలన్నారు. అలాగే రామగుండం పవర్ ప్లాంట్ స్థలంలో సింగరేణి నిర్మించ తలపెట్టిన ప్రయత్నాలు విరమింపజేయాలన్నారు. జెన్‌కో ఉద్యోగులతో పవర్ ప్లాంట్ నిర్మించి ఆపరేషన్ మెయింటెనెన్స్ ఇవ్వాలని కోరారు.

ములుగులో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ప్రశాంత్

ఏఆర్ కానిస్టేబుల్‌కు విషపురుగు కాటు

ములుగురూరల్, ఆగస్టు27: రాష్ట్ర గవర్నర్ పర్యటనలో భాగంగా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట అటవీ ప్రాంతంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్‌ను విషపురుగు కాటు వేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ప్రశాంత్‌ను పోలీసులు ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహించగా ప్రశాంత్ గంట సేపటికి కోలుకున్నాడు. కాగా, 24గంటల వరకు వైద్యులు అతడిని పర్యవేక్షణలో ఉంచాలని సూచిస్తూ దవాఖానలో అడ్మిట్ చేసుకున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27 : కేటీకే ఓసీ- 2లో అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కేటీకే ఓసీ-2 గనిని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేశ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసీ-2లో ఉన్న పెండింగ్ సమస్యలను సింగరేణి యాజమాన్యం వెంటనే పరిష్కరించాలన్నారు. డంపర్ షెడ్ కార్మికులకు యాక్టింగ్ విషయంలో అన్యాయం జరుగుతున్నందున యాక్టింగ్ విషయంలో న్యాయం చేయాలని గని మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి జీ సుధాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి రామచందర్, బ్రాంచ్ నాయకులు, పిట్ కార్యదర్శి ఎండీ కరీముల్లా, సహాయ కార్యదర్శి సామ కృష్ణ, పర్వతాలు పాల్గొన్నారు.

కవిత విడుదలతో టీబీజీకేఎస్ సంబురాలు

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఛీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కొమురయ్య, వైస్ ప్రెసిడెంట్లు బడికల సంపత్‌కుమార్, మంగీలాల్, రవీందర్, సదానందం, వీరభద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, భూపాలపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య, సింగరేణి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పశు గణన పారదర్శకంగా చేపట్టాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పశు గణనపై అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27 : సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు అంకితభావంతో పనిచేస్తూ కచ్చితమైన పశు గణనను చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు 21వ జాతీయ పశు గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైతులతో మర్యాద పూర్వకంగా మెలుగుతూ పారదర్శకత, సమగ్రతను ప్రదర్శించాలన్నారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో పశు గణనను పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం 45 మంది ఎన్యూమరేటర్లు, 12 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు తెలిపారు. డాక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘంలో విచారణ చేపట్టాలి

చిట్యాల, ఆగస్టు 27 : ప్రాథమిక సహకార పరపతి సంఘంలో జరుగుతున్న అవినీతిపై వెంటనే విచారణ చేపట్టాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సంఘంలో లోన్ తీసుకున్న కొంత మంది రైతులు తిరిగి చెల్లించినా అప్పు ఉన్నట్లుగానే చూపిస్తున్నారన్నారు. అంతేకాకుండా ఒకే వ్యక్తి ఆధార్ కార్డుపై ఇద్దరికి లోన్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రైతులు కందుల రవీందర్, ఎలేటి నరసింహారెడ్డి, జగన్‌రెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలి ఆటో, బైక్ ధ్వంసం

మంగపేట, ఆగస్టు 27 : మండలంలోని నర్సింహసాగర్‌లో మంగళవారం ఉదయం జాగటి సతీశ్ ఇల్లు కూలడంతో ఆటో, బైక్, ఇతర వస్తు సామగ్రి ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తన జీవనాధారమైన ఆటో పూర్తిగా ధ్వంసమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

ఇల్లు కూలి ధ్వంసమైన ఆటో

వంద శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఏటూరునాగారం, ఆగస్టు 27 : రాజ్యాంగంలో కల్పించిన ఆధారంగా పెసా చట్టం, 1/70 చట్టం, ఐదవ షెడ్యూల్డ్ ఏరియాలో సామాజిక సేవా రంగాల్లో వంద శాతం రిజర్వేషన్లు కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటనను తాము స్వాగతిస్తున్నామన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్డ్ ఆదివాసీల కోసం ప్రత్యేకంగా గుర్తించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఐటీడీఏల్లో 29 శాఖలను బలోపేతం చేయాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. సమావేశంలో సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు రమణాల లక్ష్మయ్య, పొడెం రత్నం, వట్టం నారాయణ, గుంపిడి వెంకటేశ్వర్లు, కబ్బాక శ్రావణ్, వట్టం కన్నయ్య, కోటి రవి, వట్టం జనార్దన్, చందా మహేశ్, చింత శ్రావణ్‌కుమార్, వాసం తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ములుగురూరల్, ఆగస్టు 27 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన జంగాలపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన రమేశ్, వెంకటేశ్వర్‌పల్లికి చెందిన ప్రణయ్ బైక్‌పై జంగాలపల్లి నుంచి ఇంచర్ల వైపు వెళ్లే రోడ్డు ములుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వారిని ములుగు దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేశారు.

సబ్ కలెక్టర్ ఆఫీస్ నిర్మాణానికి ఏర్పాట్లు

కాటారం, ఆగస్టు 27 : కాటారం సబ్ కలెక్టర్‌గా మయాంక్ సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో కార్యాలయ ఏర్పాటుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. మండలకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. కార్యాలయం ఏర్పాటు, సౌకర్యాల కల్పన తదితర విషయాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ వెంకన్న ఉన్నారు.



వైటీసీ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా ఇంద్రగోపాల్

టేకుమట్ల, ఆగస్టు 27 : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా ఇంద్రగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఆసిఫ్, ఉపాధ్యక్షుడిగా రాజమోహన్ ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరె రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన వారికి తోటి టీచర్లు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కమిటీ నియామపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆటోడ్రైవర్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

ములుగు రూరల్, ఆగస్టు 27 : ఆటో డ్రైవర్స్ కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర కార్యదర్శి వెల్పుల నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. అనంతరం ములుగు జిల్లా అడహాక్ కమిటీని నియమించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గండ్రకోట సుధీర్‌యాదవ్, ముఖ్య సలహాదారుడిగా గట్ల వీరస్వామి, ఇన్‌చార్జిగా నరేశ్, అదనపు ఇన్‌చార్జిగా మహేందర్, కన్వీనర్‌గా హైమద్, కోకన్వీనర్‌గా హరీశ్, మల్లేశ్, తిరుపతి, భద్రయ్యను నియమించారు.



ఇంటి నిర్మాణ సామగ్రిని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మానవత్వం చాటుకున్న 'కాకులమర్రి'

మంగపేట, ఆగస్టు 27 : మండలంలోని కొత్త మల్లూరుకు చెందిన రెబ్బల రాములు ఇల్లు ఇటీవల విద్యుదాఘాతంతో కాలిపోగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మానవత్వం చాటుకున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ.23 వేల విలువైన రేకులు, ఐరన్ పైపులు, సిమెంట్ పిల్లర్లను సమకూర్చారు. ఈ సామగ్రిని మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ గోవిందనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుదుముల లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకుడు తాటి కృష్ణ బృందం బాధిత కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులతో కాకులమర్రి ఫోన్లో మాట్లాడుతూ అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరసా కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, చిలకమర్రి రాజేందర్, గాదె శ్రీనివాసాచారి, కొమరం ధనలక్ష్మి, భాస్కర్, నర్సింహులు, గుండారపు రమేశ్, అల్లె జనార్దన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మునిగల సాంబులు, గుండారపు రవి, బట్ట నరసింహారావు, ఆంజనేయులు, ధర్మరాజుల రమేశ్, పీ సరిత, రాధాకృష్ణ, కృష్ణవేణి, నరసింహులు, పీ లక్ష్మణ్, సావిత్రి, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి గుడివాడ శ్రీహరి, ఎం నరేశ్ పాల్గొన్నారు.

ఇంటింటా జ్వర సర్వే

కాటారం, ఆగస్టు 27 : కాటారం పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి సబ్ సెంటర్ పరిధి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే కొత్తపల్లి గ్రామంలో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు తిరుపతిరెడ్డి, సుమన్, సీహెచ్‌వో నిర్మల, విస్తరణ అధికారి తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎంలు నాగరాణి, సునీత, పార్వతి, సరిత, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమితి మండల అధ్యక్షురాలిగా రాజసమ్మక్క

మంగపేట, ఆగస్టు 27 : మండలంలోని కమలాపురానికి చెందిన అంతటి రాజసమ్మక్కను దివ్యాంగుల సమితి మండల అధ్యక్షురాలిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పెద్దబోయిన శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మున్నాబాయ్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో స్వయం ఉపాధి

వాజేడు, ఆగస్టు 27 : బ్యాంకు లింకేజీలతో మండలంలోని 560 గ్రూపుల నిర్వహణకు 41 వీవోఏల ద్వారా గత ఏడాది రూ.12 కోట్ల రుణాలు ఇప్పించడంతో మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారని డీపీఎం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు వాజేడు మండల మహిళా సమాఖ్య 16వ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మైక్రో ఎంటర్ ప్రైజెస్ డీపీఎం గోవింద్ చౌహాన్, ఎంపీడీవో విజయ, ఏపీఎం లక్ష్మీదుర్గ, సీసీలు మల్లాచారి, సత్యనారాయణ, శంకరమ్మ, ఎంఎస్ఏ భవాని, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జాక సమ్మక్క, వీవోఏలు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్

కన్నాయిగూడెం, ఆగస్టు 27 : మండలంలోని బుట్టాయిగూడెంలో మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ఆరు ట్రాక్టర్లను మంగళవారం తహసీల్దార్ సలీం సీజ్ చేశారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామ సమీప సర్వే నంబర్ 165లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులతో వెళ్లి జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు చెప్పారు. అనంతరం వాటిని పీఎస్‌కు తరలించామన్నారు. బుధవారం ఫైన్ కట్టిన తర్వాత వాటిని విడిచిపెట్టనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

భవన నిర్మాణాలను ఆపివేయాలి

వెంకటాపురం (నూగూరు), ఆగ స్టు 27 : ఏజెన్సీలో గిరిజనేతరుల భవ న నిర్మాణాలను నిలిపివేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మునేశ్వర్‌రావు, లక్ష్మణ్, సందీప్, నర్సింహారావు, ధనలక్ష్మి, నర్సమ్మ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

ములుగు రూరల్, ఆగస్టు 27 : తమకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని జర్నలిస్టులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గవర్నర్ గ్రీవెన్స్‌లో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేసి కార్పొరేట్ వైద్యం అందించేలా చూడాలని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జంగిలి కోటేశ్వర్‌రావు, పిట్టల మధుసూదన్, గుర్రం శ్రీధర్, దూడబోయిన రాకేశ్, జాలిగపు శ్రీనివాస్, నర్ర రఘువీర్, జినుకల ప్రభాకర్, గండ్రకోట విష్ణుకుమార్, ఎనగందుల కొమురయ్య, తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

మహదేవపూర్, ఆగస్టు 27 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్, నాయకులు సందేశ్ హర్షిత్, ఆయేశా, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి వేడుక నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

మంగపేట, ఆగస్టు 27 : కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన ఆవరణలో మంగళవారం ఆలయ సిబ్బంది ఉట్టికొట్టే వేడుకలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. అనంతరం సంప్రదాయం ప్రకారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో సత్యనారాయణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.